క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం నిల్!

- హాస్టళ్లపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దారుతో మాట్లాడుతున్న విద్యానాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ : స్థానిక ఎస్సీ బాలుర, బాలికల, బీసీ బాలుర హాస్టళ్లలో ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టటండలేదని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి సోమవారం తహసీల్దారు హనుమాన్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ, హాస్టళ్లలో భోజనం నాణ్యతతో లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తన దృష్టికి తెచ్చారన్నారు. అలాగే జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో బయట యువకులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, ఈ ఉదంతాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. హాస్టళ్లను పరిశీలిస్తానని, విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్న ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీటీ శివయ్య, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

గంగనీటి కోసంరైతుల ఆందోళన

బుచ్చినాయుడుకండ్రిగ: తెలుగుగంగ నీటి కోసం సుగ్గుపల్లె, జంబుగోళం రైతులు స్థానిక తెలుగుగంగ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, తెలుగుగంగ మెయిన్ కాలువ 105 కిలోమీటరు వద్ద నున్న తూము నుంచి పెద్దపాలేడు చెరువుకు నీరు చేరుతుందని, ఇదే చెరువు నుంచి జంబుగోళం, సుగ్గుపల్లె చెరువులకు నీరు చేరవలసి ఉందన్నారు. అయితే పెద్దపాలేడు చెరువు నుంచి నీరు వచ్చే కాలువ చిన్నదిగా ఉండడంతో తమ చెరువులకు నీళ్లు చేరడం లేదని, కాలువను విస్తరించాలని డిమాండ్ చేశారు.

దేశమ్మ ఆలయానికి విరాళం

ఏర్పేడు: మండలంలోని నాగంపల్లెలో దేశమ్మ ఆలయ నిర్మాణానికి దీవి క్షేత్ర ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, సినీ నిర్మాత సీఆర్ రాజన్ ఇటీవల రూ.2,0,116లను విరాళంగా అందజేశారు. ఈ నేపథ్యంలో త్వరలో నిర్వహించనున్న ఆలయ కుంభాభిషేకం పూజలకు హాజరుకావాలని సోమవారం ఆయనకు గ్రామస్తులు ఆహ్వాన పత్రికను అందజేశారు.

పుస్తక పఠనంపై అవగాహన సదస్సు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి జెడ్పీ హైస్కూలులో సోమవారం పుస్తకపఠనంపై అవగాహన సదస్సు ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఆధ్యాత్మిక అవధూత మాసపత్రిక ఎడిటర్ అక్కుర్తి ఆనందరెడ్డి మాట్లాడుతూ, మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడు వంటిదన్నారు. ప్రతి విద్యార్థి తన జీవితకాలంలో మహాభారతం, భాగవతం, భగవద్గీత, రామాయణం వంటి మహాగ్రంథాలను చదవాలన్నారు. అనంతరం పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. జిల్లా ట్రెజరీ విశ్రాంత డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఈఓల బాధ్యతల స్వీకరణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల విద్యాశాఖాధికారి–2గా మునిసుబ్రమణ్యం సోమవారం స్థానిక ఎంఆర్‌సీలో బాధ్యతలు స్వీకరించారు. వరదయ్యపాళెం ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనను ఎంఈఓ రవీంద్రనాథ్ సన్మానించారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండల విద్యాశాఖ అధికారి–2గా దయాకర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కేవీబీపురం మండలం కాళంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మావిడిగుంట, గోవిందరావుపల్లెలో సోమవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో 151 ఇళ్లను సందర్శించారు. ఆయా కుటుంబాల వారికి అందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. గత 30 ఏళ్లగా తమ గ్రామాన్ని ఎవరూ పట్టించుకోలేదని, అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అంతేకాకుండా రూ.30లక్షలతో అంతర్గత రోడ్లు వేయడం ఆనందంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. అటవీ ప్రాంతం కావడంతో ఆర్‌అండ్‌బీ రోడ్లు వేయడానికి ముందుకు రావడం లేదని, ప్రత్యామ్నాయం ఆలోచిస్తామన్నారు.

టీచర్‌పై గ్రామస్తుల ఫిర్యాదు

పాఠశాల ఉపాధ్యాయుడు మునికృష్ణయ్య స్కూలుకు సక్రమంగా రావడం లేదని, వచ్చినా సరిగా విద్యాబోధన చేయడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వచ్చిన అరగంటకే ఆయన వెంకటగిరికో, వాంపల్లెకో వెళ్లిపోతున్నారని, దీని వలన తమ పిల్లలు విద్యాపరంగా వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, ఆ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ భువనేశ్వరిని ఆదేశించారు. కోటి వెంగయ్య, భాస్కర్, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, శ్రీనయ్య, వెంకటరమణయ్య, మునెయ్య, రమణయ్య, మనోహర్, ధనయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

మారెమ్మ జాతరకు ఎమ్మెల్యే విరాళం

రేణిగుంట మండలం అత్తూరు దళితవాడలో మారెమ్మ జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.10వేల విరాళం అందజేశారు. పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో జాతర కమిటీ సభ్యులు ఆయనను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన విరాళమిచ్చారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: స్థానిక చెన్నైరోడ్డులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. 23న అంకురార్పణ, ధ్వజారోహణంతో మొదలయ్యే బ్రహ్మోత్సవాలు 5వ తేదీన పార్వేట ఉత్సవంలో పరిసమాప్తమవుతాయని చెప్పారు. 23 నుంచి నిర్వహించే రోజువారీ ఉత్సవాల కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అంజూరు, ఈఓ తదితరులు

‘జగనన్న సురక్ష’ జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ ముని రవికుమార్

సత్యవేడు: ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ వంద శాతం అందించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సమన్వయ కృషి చేయాలని ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ బి.ముని రవికుమార్ కోరారు. సోమవారం సత్యవేడు సచివాలయం 1 ,2, 3 పరిధిలోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ మాట్లాడుతూ, గ్రామాల పరిధిలోని వలంటీర్లుకు కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, అందని సంక్షేమ పథకాల వివరాలు గుర్తించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ విషయమై మండలంలోని పంచాయతీల్లో రెండు బృందాలు పర్యటిస్తాయన్నారు. ఆయా బృందాలు పర్యటించినప్పుడు ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేసేలా సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో సచివాలయ కార్యదర్శులు హరీష్, సునీల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు నవీన్, రాజేష్, రెహన్ అమ్మన్, వలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రప్రభపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి సోమవారం సాయంత్రం చంద్రపభ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం నిత్య పూజా కైంకర్యాల అనంతరం 6 గంటలకు ఉత్సవ మూర్తులు తిరుచ్చి వాహనంలో ధ్వజస్తంభం వద్ద కొలువుదీరారు. ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించిన అర్చకులు నందీశ్వరుని చిత్రపటమున్న వస్త్రాన్ని అధిరోహింపచేసి అష్టదిక్పాలను ఆహ్వానించారు. 10 గంటలకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఉత్సవాలలో రెండో రోజు మంగళవారం సాయంత్రం సింహ వాహనంపై స్వామి వారు విహరిస్తారు. కార్యక్రమంలో ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.



చంద్రప్రభ వాహనంపై పరాశరేశ్వరస్వామి

వాటర్ ప్లాంట్ ప్రారంభం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం తాటిపర్తి, కల్లిపూడి ప్రజల సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్‌ను మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బియ్యపు పవిత్రారెడ్డి ప్రారంభించారు. మినరల్ వాటర్ ప్లాంట్ లేకపోవడంతో ఇటీవల గ్రామస్తులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకునివెళ్లారు. స్పందించిన ఆయన మండలంలోని కజారియా సిరామిక్ టైల్స్ కంపెనీ వారితో మాట్లాడారు. ఆ కంపెనీ సౌజన్యంతో రూ.11లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. సోమవారం తాటిపర్తిలో దీనిని పవిత్రారెడ్డి ప్రారంభించారు. కజారియా కంపెనీకి కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో ఏ సమస్యలున్నా తమ దృష్టికి తెస్తే ఎమ్మెల్యేతో సంప్రదించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో తొట్టంబేడు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ నాగేంద్ర, ఎంపీటీసీ శోభన్ బాబు, చంద్రయ్య నాయుడు, కజారియా ప్లాంట్ ఇన్‌చార్జి రాజేంద్ర, హెచ్‌ఆర్ సుధాకర్, పెరుమాళ్, జగదీశ్వరరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో పవిత్రారెడ్డి

ఎస్‌బీఐలో వెలుగు రుణాల మంజూరు జాప్యం

- గగ్గోలు పెడుతున్న డ్వాక్రా సంఘాల మహిళలు



ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న డ్వాక్రా మహిళలు

వరదయ్యపాళెం: స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన శాఖలో తమకు రుణాలు మంజూరు చేయడంలో అలసత్వం వహిస్తున్నారని డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు వాపోతున్నారు. 3 నెలలుగా దాదాపుగా 20 డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. అయితే దానికి సంబంధించిన రికార్డులన్నీ వెలుగు సిబ్బంది బ్యాంకు వారికి అందజేసినప్పటికీ రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకు అధికారులు స్పందించడం లేదంటూ బాధిత డ్వాక్రా సంఘం సభ్యులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో పులివల్లం, మోపూరుపల్లె, చిన్న పాండూరు, తొండంబట్టు, మత్తేరిమిట్ట, వరదయ్యపాళెం ప్రాంతాల్లో డ్వాక్రా సంఘాలకు దాదాపుగా రూ. కోటి పైగా రుణాలు పంపిణీ చేయాల్సి ఉంది. వీరంతా గతంలో తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి బ్యాంకుకు చెల్లించి మరలా లోన్లు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో రుణాలు పంపిణీ ఆలస్యమవుతోందని బాధిత మహిళలు వాపోతున్నారు. ప్రధానంగా మండలంలో 1100 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఉండగా అందులో 800 గ్రూపులు వరదయ్యపాళెం ప్రధాన బ్రాంచ్‌లో రుణాలు పొందినవారే. ఎస్బీఐ ఉన్నతాధికారులైనా స్పందించి సకాలంలో రుణాలు ఇప్పించాలని కోరుతున్నారు. బ్రాంచ్‌లో పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడం మూలాన రుణాల మంజూరులో జాప్యం చోటుచేసుకుంటోందని స్థానిక బ్రాంచ్ మేనేజర్ చెప్పారు.

ఓపెన్ వర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగరాజునాయుడు, అధ్యయన కేంద్ర కో–ఆర్డినేటర్ బాపనయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ ఇంటర్, 10+2 పాసైన విద్యార్థులు అర్హులని, జూలై 31లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే రెండవ, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు జూలై 31 చివరి తేది అని తెలిపారు. మరిన్ని వివరాలను సంబంధిత వెబ్‌సైట్ లేదా 7382929647 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం భీమవరంలో ఆదివారం బి.వెంకటయ్య మృతి చెందాడు. వీరిది పేద కుటుంబం కావడంతో స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సోమవారం ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

బహిర్భూమికి వెళ్లి వస్తుంటే..!



గాయపడ్డ వెంకటస్వామి

ఏర్పేడు: గుర్తు తెలియని మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద చోటుచేసుకుంది. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం.. మేర్లపాక ఎస్సీ కాలనీకి చెందిన వెంకటస్వామి(45) కాలినడకన సోమవారం తెల్లవారుజామున తిరుపతి–శ్రీకాళహస్తి ప్రధాన రహదారిని దాటుకుని బహిర్భూమికి వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళుతున్న గుర్తు తెలియని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రమాదంలో వెంకటస్వామి కుడికాలు విరిగింది. 108లో అతడిని తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన మోటార్ సైక్లిస్టును పట్టుకునే పనిలో పడ్డారు.

ఆణిముత్యాలకు సన్మానం



బహుమతులు అందజేసిన సర్పంచ్ శేఖర్, ప్రధానోపాధ్యాయుడు మోహిద్దీన్, టీచర్లు

సత్యవేడు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న పథకాలు, ఇస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ శేఖర్ అన్నారు. సోమవారం ఇరుగుళం జెడ్పీ హైస్కూలులో టెన్త్ ప్రతిభావంతులు డి.పవన్, వి.చార్మి, జి.ప్రకాష్‌లకు జగనన్న ఆణిముత్యాలు పేరిట పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు మోహిద్దీన్‌తోపాటు సర్పంచ్ వారికి ప్రభుత్వ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే.మధు, ఎస్. జయచంద్రుడు, కే.గిరి, టి.చెంచురెడ్డి, ఈ.గాయత్రి, పి.నీలకంఠం, సురేష్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో..



శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. అలాగే మంచి మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల తరపున శాలువా కప్పి నగదు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్కాడు శంకర్, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూలు స్థల ఆక్రమణపై ఫిర్యాదు

ఏర్పేడు: మండలంలోని మునగలపాలెం జెడ్పీ హైస్కూలు స్థల ఆక్రమణపై గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు సోమవారం తహసీల్దారు ద్వారకనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వికృతమాల రెవెన్యూలో సర్వే నంబరు 343–2లో స్కూలు 8.5 ఎకరాల భూమి ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం స్థానికేతరుడైన ఓ రియల్టర్ ఆ భూములను ఆక్రమించి, ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని, దీనిపై దృష్టి సారించి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు.

విద్యకు అధిక ప్రాధాన్యత



నాగలాపురంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీచర్లు

పిచ్చాటూరు: జగనన్న ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం సాయంత్రం నాగలాపురం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అలాగే నాడు–నేడు పనులను కాంట్రాక్టర్లకు కట్టబెట్టకుండా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పీఎంసీ కమిటీలకే అప్పగించిందన్నారు. రెండు విడతల్లో అన్ని పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. టీచర్లు, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేసి దాని స్థానంలో జీపీఎస్ అమలు చేసి ఆదుకుంటోందని గుర్తుచేశారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని జగనన్నకు అండగా నిలబడాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అనంతరం నాగలాపురం జూనియర్ కళాశాల అధ్యాపకులు వేలాయుధం, బీరకుప్పం జెడ్పీ హైస్కూల్ టీచర్ విజయకుమార్ మాట్లాడారు. నాడు–నేడుతో స్కూళ్ల అభివృద్ధి, జగనన్న విద్యాకానుక వంటి పథకాలు తమ సర్వీసులో చూడలేదన్నారు. సీపీఎస్ రద్దుపై టీచర్లు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంఈఓ బాబయ్య, తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ పద్మజ, సింగిల్ విండో చైర్మన్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, సచివాలయ మండల కన్వీనర్ మోహన్‌మొదలి, వైఎస్ఆర్‌టీయూసీ నియోజకవర్గ చైర్మన్ ఎస్ఎం సురేష్, నాయకులు మహేష్‌రెడ్డి, శ్యామ్, మహేష్, దానియేల్, పయణి, దేశప్పన్, ఉపాధ్యాయ సంఘ నాయకులు, టీచర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించరూ!

- మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టర్, ట్రాన్స్‌కో సీఎండీలకు ఎమ్మెల్యే వినతి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. సోమవారం ఉదయం తిరుపతిలోని మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆ తర్వాత కలెక్టర్ కార్యాయానికి వెళ్లి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీఆర్‌ఓ శ్రీనివాసరావులను ఎమ్మెల్యే కలిశారు. రూ.26 కోట్లతో నిర్మిస్తున్న దాసుకుప్పం బైపాస్ రోడ్డుకు సర్వే పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసిన పంచాయతీల్లో వివిధ సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరుపై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం ఎస్పీడీసీఎల్ కార్యాలయానికి వెళ్లి సీఎండీ సంతోష్‌రావును కలిశారు. ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో వచ్చిన విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందులో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు. వైఎస్ఆర్‌సీపీ నాగలాపురం మండల కన్వీనర్ అపరంజిరాజు, రైతు సలహా మండలి కన్వీనర్ చిన్నదొరై, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు పయణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ: ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసే కౌలురైతులందరూ విధిగా రెవెన్యూ శాఖ జారీ చేసే కౌలు గుర్తింపు కార్డులను పొందాలని తహసీల్దార్ హనుమాన్ నాయక్ కోరారు. సోమవారం మండల వ్యవసాయాధికారి భారతి, వీఆర్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. వీఆర్‌ఓలు కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు గుర్తింపు కార్డును అందేలా చూడాలని ఆదేశించారు. కౌలు గుర్తింపు కార్డు ఉంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు వైఎస్ఆర్ రైతు భరోసా వర్తిస్తుందని, అలాగే పండించిన వ్యవసాయోత్పత్తులను కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవచ్చని, ఒకవేళ ప్రకృతి విపత్తుల వలన పంటలు నష్టపోతే పరిహారం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. దీనిని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీటీ శివయ్య, ఆర్ఐ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

రేణిగుంట: వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు అన్నారు. సోమవారం కరంబాడి రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ కులాల ఉప ప్రణాళిక కింద వరిసాగు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డ్రమ్ సీడర్ పద్ధతి, కేవీకే విధి విధానాలు, లోదుక్కులు, భూసార పరీక్షలు, ఎరువుల వాడకం, విత్తనశుద్ధి, సమగ్ర పంట యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వంద మంది రైతులకు ఆర్ఎన్ఆర్ 15048యు వరివిత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దివ్య, సుధాకర్, పద్మజ, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంట : మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఆరుద్ర నక్షత్ర అభిషేకం

పిచ్చాటూరు: మండలంలో సిద్ధిరాజుకండ్రిగలోని శ్రీ గౌరీ సమేత సోమనాథేశ్వరుని ఆలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్ర అభిషేకం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మూల విరాట్‌కు భక్తుల నడుమ రుద్రాభిషేకం నిర్వహించారు. గజమాలతో సోమనాథేశ్వరుని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త భక్తులకు అన్నదానం చేశారు.